# బలిదానం

"పిల్లలు ఇక పుట్టరని దామోదరం భార్యను వదిలేశాడట!"

ప్రొఫెసర్ దామోదరాన్ని గానీ. తులసినిగానీ ఎరిగున్నవారు నలుగురొకచోట జేరితే సమయమంతా ఆ విషయం మాట్లాడుకోవటంలోనే గడిచిపోతోంది ఈ మధ్యన.

ఇటువంటి వార్తలను సృష్ట్యాదిగా అడపా తడపా ప్రతి ఒక్కరూ వింటూన్నప్పటికీ మళ్ళీ ఎప్పటికప్పుడే కొత్తగా మాట్లాడుకోవటం, విడ్డూరంగా వినడం పరిపాటి.

తులసితో ప్రాణస్నేహం లేకపోయినా మంచి పరిచయమే వున్నది నాకు. 'మంచి మనిషి' అన్పించగలిగే ప్రవర్తనా, తీరూ, మాటా గల వ్యక్తి. చెడు నడత ఏమీ ఉన్నట్లు అన్పించదు మరి! అయినా మంచివారందరి జీవితాలూ మంచిగా - సుఖంగా సాగుతాయని ఏముంది, అందునా మన సమాజంలో?

"పుట్టింటివాళ్ళేమంత ఉన్నవాళ్లు కాదు: తులసికా పెద్ద చదువు సంధ్యలు లేవు. ఎలా బ్రతుకుతుందో పాపం ఇక?" అన్నది మిసెస్ రావు ఒకనాడు.

"ఏముందీ. వదిలేసినవాడు చచ్చినట్టు మనోవర్తి ఇచ్చుకోవాలిగా? ఇస్తాడు" అన్నది సవితా బెనర్జీ, తీర్మానించినట్టే.

"అతడా — ప్రవరాఖ్యుడేమీ కాదు, పైగా శ్రీకృష్ణుడు కూడా! ఈమెకా పెళ్ళై ఆరేళ్ళైనా ఇంకా పిల్లల్లేరు! అతడు తొందరపడ్డా ఈమె తొందరపడి వెళ్ళిపోవడమేమిటి? తనకున్న లోపానికి ఏదో అక్కడే పడుండాలి కానీ..." లోకనాధం భార్య కమలానాథం తన అమూల్యాభిప్రాయాన్ని సెలవిచ్చింది.

"కాదు మరీ. మొగాడికేముందీ, మూడోనాటికల్లా మరొకత్తె దొరుకుతుంది." మిసెస్ రావు సమర్థించింది.

శ్యామలా శర్మ పకపకా నవ్వింది. "అయ్యో మీకు తెలియదేమిటండీ? ఇది వరకే దొరికింది, అతడితోపాటే లెక్చరర్ అట అది కూడా అక్కడే."

'తోటి ఆడవాళ్ళైవుండి సాటి స్త్రీ కష్టాన్ని ఎంత ఖులాసాగా నవ్వుకుంటూ వ్యాఖ్యానిస్తున్నారో'నని నా మనస్సు ఆశ్చర్యపడకుండా వుండలేకపోయింది.

"ఔనండీ-" ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుందొకావిడ. ఇంతా చదువుకుని అంతా ఉద్యోగం వెలిగిస్తూ దానికి వీడేకాని దొరకలేదా? ఆ కాలేజీలో పిల్లలకి కూడా ఇలాటి పాఠాలే నేర్పుతోందేమో! ఛీ. ఈ చదువుకుని పెళ్ళీ పెటాకులు లేకుండా పడున్న అడాళ్ళెంతకైనా తెగించి కొంపలు మాపుతారనుకోండి. ఒకతె సంసారాన్ని కూల్చి దానింట్లో దీపం వెలిగించుకుంటే అది నిలుస్తుందంటారా?"

సంభాషణ కొత్తదారులు త్రొక్కింది.

తులసిపట్ల నా కెంతయినా సానుభూతి వుంది కానీ ఆమె ప్రస్తుతం ఎక్కడుంటున్నదో తెలియదు. అయినా బొత్తిగా ఇటువంటి పరిస్థితిలో ఎలా పరామర్శించడం? ఏమని సానుభూతి పలకడం?

తనతో కలసిమెలసి స్నేహంగా ప్రవర్తించిన సాటి స్త్రీలే ఇంత లోకువచేసి మాట్లాడ్తున్నారని తెలిస్తే తులసి ఏ ఆత్మహత్యకో తలపడదా? భర్త పరిత్యజించడంకంటె ఘోరం కదా ఈ కఠోర పరిహాసోక్తులు!

దామోదరం కూడా మొహం చాటువేశాడు. మా ఇంటి ఛాయలకే రావటంలేదు.

"విషయం పాతబడేవరకూ పాత స్నేహితులందర్నీ తప్పించుకు తిరుగుతా డనుకుంటాను." అన్నారాయన ఒక నాడు. "మొన్నొకనాడు బజార్లో ఎదురై చూడనట్లు వెళ్ళి పోయాడు" అన్నాడు.

"తులసి ఏమైందో ఏమైనా తెలుసా?" అనడిగాను నేను.

"ఏమో తెలియదు కానీ, లోకంలో అనేకం జరుగు తూనే వుంటాయి. ఎప్పుడూ అదే ఆలోచనా ఇక నీకు? మర్చిపో, ఆలోచించి ఆలోచించి అట్టే మతి పోగొట్టుకోకు" అన్నారు.

"ఏమయినా కొత్త కథావస్తువు దొరుకుతుంద నేమో!" అంటూ తన స్నేహితులు నవ్వారు.

'మర్చిపో' అనడం సులభమే కానీ మరువడం నాకు

సాధ్యమా? మాటి మాటికీ ఆమే వచ్చి ఆలోచనల నడుమ నిలుస్తూన్నది.

కష్టకాలంలో వున్నవారిపై కనికరం లేకుండా కాల క్షేపం కోసం కాదుకూతలు కూసే నాగరికురాండ్ర సమావేశాలలో సాధారణంగా కూర్చోను. అందువల్లనే నా కిక ఏ వివరాలూ తెలియరాలేదు.

బాబుకు విపరీతంగా జ్వరంవచ్చి తగ్గింది. ఎంతైనా ఖంగారుపడిపోయాం వారం రోజులు. ఒకనాడైతే మరీ కన్నెరగకుండా పడివుండి, ఏవేవో కలవరిస్తూంటే నా ప్రాణా లెగిరిపోయాయి.

"ఇవాళ పిక్చర్‌కు వెళ్దాం" అన్నారు అఫీసునుంచి వచ్చి. బాబుకు జ్వరం బాగా తగ్గింది. కులాసాగా వున్నాడు.

'ఏం, నీకేమయినా వేరే పనుందా!' అన్నారు నేను మాట్లాడకపోవడం చూచి.

'బాబును ఆలయానికి తీసుకువెళ్దామనీ. మొన్న జ్వరం వచ్చినప్పుడు అనుకున్నాను.'

ఆ ముఖంలో రంగులు ఎలా మారతాయో తెలుసు గనుక నేను అటు చూడకుండానే చెప్పాను.

కొన్ని సెకండ్ల నిశ్శబ్దం.

'ఊఁ' ఉపన్యాసానికి నాందిగా వినవచ్చింది. 'అయితే డాక్టరుకు అంతబిల్లు ఎందుకు చెల్లించినట్లు? అప్పుడే తీసుకెళ్ళలేక పోయావ్ గుళ్ళోకి?"

నేను మాట్లాడలేదు.

'మనం మందులు వేశాం, సేవ చేశాం, తగ్గింది. దైవకృప వున్నదనుకో, దేవుడు లేడని అనను. కాని ఆ మందిరంలోనే వున్నాడని ఎందుకనుకోవాలీ? నీ మనసులో లేడా, నీ యింట్లో లేడా?'

కొన్ని విషయాలలో మేమిద్దరం ఉత్తర దక్షిణ ధ్రువాలం. అందుకే నేను వాదించదలుచుకోలేదు.

'నేనీ బూట్లు తీసీవేసీ చెయ్యలేనిప్పుడు. పిల్లల్ని తీసుకుని నువ్వెళ్ళి దర్శించుకురా'' అన్నారు కారు దిగకుండా.

ఇదీ మాకు మామూలే!

దైవ దర్శనం చేసుకున్న ప్రశాంతీ సంతోషమూ ఆవిరిలా యిగిరిపోయాయి మందిరం బయటకు వచ్చి ఆంగణంలో కూర్చోగానే, అక్కడి వ్యక్తులను చూచి.

"ఎలావున్నారమ్మా ఏమిటి విశేషాలూ?'' అని అతి చనువు ఒలకబోస్తూ పలకరించిన ఆ వ్యక్తి తులసి అత్తగారు విద్యాబాయి.

నిశ్చింతగా; ఏ బాధా వ్యధా లేనట్లుగా చెప్తోన్నాయి. ఆరోగ్యంగా వున్న ఆ రూపమూ, నిర్లజ్జగా వున్న ఆనవ్వూ! వెంట కూతుళ్ళూ ఇంకెవరోకూడా వున్నారు.

"బాగున్నారా? తులసి ఎలా వుంది?'' అప్రయత్నంగానే నా మాటలలో తులసి ప్రసక్తి దొర్లిపోయిందీ.

విద్యా చింకి చాటంత ముఖమూ నవ్వు మాసిపోయి ఇండిబుగాయిలా అయిపోయింది తులసి పేరు వింటూనే.

కూతురినుండి వచ్చింది ఠపీమని సమాధానం. "ఆడది

ఎక్కడుంటుందీ? అయితే అత్తింటా, లేదా పుట్టింటానూ, ఏం, అలా అడుగుతున్నారేం?" శల్యపరీక్ష చేస్తూన్నట్టే చూడసాగింది నన్ను నఖశిఖ పర్యంతమూ! ఈ అతి తెలివీ, భుజాలు తడుముకోవడం చూస్తే నాకు చిరాకైంది. లోక మంతకూ తెలిసిన విషయం నాకు తెలియదనేనా ఈమె అభిప్రాయం? అందుకే నేనూ సంభాషణ అంతం చేయలేదు.

"ఈ మధ్య తులసి ఎక్కడా రావడమే మానేసింది. దామోదరంగారు కన్పించి కూడా చాలా రోజులైంది. ట్రాన్స్ఫరైందేమో ననుకుంటున్నాను. అందుకే అడిగాను" అన్నాను.

తల్లీ కూతుళ్ళు ముఖాలు చూచుకున్నారు.

బయటినుంచి వుండీ వుండీ కారు హారన్ విన్పిస్తోంది.

కూర్చున్నదల్లా విద్యాబాయి ఒక్క ఉదుటున లేచి, నా దగ్గరకు వచ్చింది. రహస్యం చెప్తూన్నట్లుగా గుసగుసలు పోతూ అన్నది: "మీకు తెలియదనుకుంటాను - మావాడు రెండోపెళ్లి చేసుకున్నాడమ్మా! అదుగో- ఆపిల్లే. అందుకే గుళ్ళోకి తీసుకొచ్చానూ." అంటూ కూతుళ్ళ పక్కనేవున్న ఓ అతి నాగరికంగా కన్పడు తున్న యువతిని చూపింది. యువతి అనేకంటే ప్రౌఢఅంటే ఒప్పుతుందేమో! ముఖంలో ముదిమి బాగా కన్పిస్తోంది. నేనలాగే కళ్ళప్పగించి చూడ సాగాను.

విద్యాబాయి ఇంకా చెప్తూనేవున్నది. "ఏముందమ్మా ఇవ్వాళ కాకుంటే రేపైనా నలుగురికీ తెలిసేదేకదా! గొడ్రాలిని ఎన్నాళ్ళని భరిస్తాడు మొగాడు? వంశాంకురం లేని

బ్రతుకెందుకూ? ఇంట్లో అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళూ అంతా సంతానవంతులే. ఇంటా బయటా అందరూ పిల్లల్ని వెంట బెట్టుకునీ భుజాలెక్కించుకునీ తిరుగుతూంటే వాడి కళ్ళల్లో ఎంత దిగులు కురిసిందో, లోలోపల ఎంత క్రుళ్లి పోయేవాడో కన్నతల్లిని- నాకమ్మా తెలుసు! ఎవరికి తెలుస్తుంది? లోకమంతా ఆడిపోసుకుంటున్నారట - ఎవరి బాధ ఎవరికి తెలుస్తుందిలెండి..."

అంతలో ఆమె కూతురు రమ వచ్చింది. "ఎందుకమ్మా అందరికీ అలా సంజాయిషీ చెప్పుకుంటావూ? ఎవరి కష్టం ఎవరికి తెలుస్తుందీ? ఎవరిష్టం వాడిదీ." అంటూ నా వేపు తిరిగి "అయినా మీరే చెప్పరూ. ఆడదానికి అంత అహమా? మగవాడిని చూసీ చూడనట్టు వదిలేయాలా లేక తెగేవరకూ తాడు లాగుతుందా తెలివైన దెవతైనా? ఏమాత్రం మెదడున్నా తనకు దగ్గరదాన్నెవతైనా తనే చేసి వుండేది. ఏ పొరపొచ్చాలూ లేకుండా ఇద్దరూ పడివుందురు, నేనసలామాట కొత్తగానే మా అందరిపైనా విరుచుకుపడిందను కోండి. అందుకే కాపురం కూలద్రోసుకు పోయింది!"

తులసి మా యింటికి తరచూ వస్తూండేది గనుక నే నామెపక్షమనే భావంతో వాళ్లిలా గోలపెడ్తూ అడగనిదే సంజాయిషీ లిచ్చుకుంటున్నా రన్నమాట! 'దామోదరం ఎంత చవట!' అన్పించింది నాకు మొదటిసారిగా. చవట కానిదే అతడి వ్యక్తిగత విషయంలో తల్లికీ, అక్కకూ అంత అధికార మేమిటి?

వాళ్లింకా ఏమేమో చెప్తూనే వున్నారు కానీ విన

డానికి నాకు కంపరంగా వున్నది. అందుకే 'పని వుం'దని చెప్పి వదిలించుకుని బయటపడ్డాను.

"దైవదర్శనంతో పాటు పురాణశ్రవణ పుణ్యంకూడా దక్కించుకొని వచ్చినట్లున్నావే?"

శ్రీవారి స్వరంలో హేళన కొట్టవచ్చినట్టుగా విన్పిస్తోంది.

"దామోదరం తల్లీ, చెల్లెళ్ళూ కదూ వాళ్ళు!" అన్నాడు మళ్ళీ.

"ఆఁ, కొత్తపెళ్లాంకూడా వుంది వాళ్లల్లో చూడండి" అన్నాను.

"అక్కర్లేదులే, నువ్వు తరించావు, చాలు." మరో హేళనాబాణం.

"ఏమిటటా? కోడలి కాపురం నిలువునా కూల్చిన పాపం కడిగేసుకోవటాని కొచ్చిందటనా?" మరో విషమ ప్రశ్నం.

నాకువిసుగన్పించింది. "బాగుంది, ఎవ తెందుకొచ్చిందో నాకేం తెల్సు? మీ పిక్చర్ ప్రోగ్రాం కాదన్నానని మరీ ఇంత చిరాకు ప్రదర్శించాలా?"

"అదికాదోయ్! అలాంటి పాపిష్టివాళ్లంతా తమ పాపాల్ని చూచీచూడనట్టు వదిలేయమంటూ దేవుడికి లంచాలు పెట్టటానికి వస్తూంటే ఈ దొంగనమస్కారాలందుకోలేక దేవుళ్ళు ఏనాడో ఆలయాలు విడిచి పారిపోయారు పత్తాలేకుండా. ఇక నువ్వు ఏమాశించి ఆ ఆలయాలలోనికి వెళ్తున్నావ్? దేవతా దర్శనానికి బదులు అలాంటి పాపిష్టి

ముఖాలు చూస్తున్నావ్, అంతేకదా?"

ఈ గొణుగుడూ, వాద ప్రతివాదాలు అర్థంకాక ఏమిటో డ్రైవర్ మధ్యమధ్య మాముఖాలు చూస్తున్నాడు. ఇక్కడకొచ్చిన మొదట్లో భాష రాక నానాఅవస్థలూపడుతూ తిట్టుకొనేదాన్ని. కానీ, ఇటువంటి పరిస్థితుల్లోమాత్రం ఇదే బాగుందనిపిస్తుంది. మన గోల ఏమిటో చచ్చినా వాళ్ళకి తెలియదు!

ఈ మధ్య కాస్త మరుగునపడిన తులసి తలపులు మరలా వచ్చి నా మెదడులో ప్రవేశించాయి. 'అసలు వీళ్ళంతా కలసి తులసిని ఏమైనాచేసేశారా లేక బ్రతికివుందా' అనే అనుమానం కూడా కలిగింది నాకు. ఒక్కసారి తులసి కనిస్తే బాగుండును.

"తులసికనిపిస్తే బాగుండును. పాపం తులసిఏమైందో' అని అనుక్షణం అనుకుని తపించినదానల్లా తీరా తులసి కళ్లెదుట నిలబడగానే అప్రతిభురాలనై మాటలూ చేష్టలూ దక్కి నిలబడ్డాను.

బాబును స్కూల్లో దిగవిడిచి వస్తూంటే ఒక బస్సు స్టాపులో నిలబడ్డ నలుగురైదుగురు మనుషులలో తులసి కన్పించి ఆగి చూశాను. ఇంతలో ఆమె నన్నుచూచి తనంత తానే దగ్గరకు వచ్చి "బాగున్నారా?" అని పలకరించింది.

'ఎలా మాట్లాడాలీ, ఏమని ఓదార్చాలీ'అని లోలోన కలవరపడుతూ ఖంగారు పడుతున్న నన్ను ఆమే కుశలప్రశ్న వేసేసరికి - కొలది క్షణాలు నిరుత్తరాల నయ్యాను.

వెంటనే తులసి ముఖం ముడుచుపోయింది. "నేను తులసినండీ," అన్నది ఒత్తిపలుకుతూ. "మీరు కూడా నాతో మాట్లాడితే పరువుతక్కువగా భావిస్తారనుకోలేదు." వెళ్ళడానికి ఉద్యుక్తురాలైంది.

"ఛఛ." ఆమె చేయి గట్టిగా పట్టుకుని ఆపి కూర్చో బెట్టాను. "అనుకోకుండా కనిపిస్తే ఉక్కిరిబిక్కిరయ్యాను. అంతే. దా, మా ఇంటికి వెళ్దాం. ఏమైనా అర్జంటుపనిగానీ లేదుకదా!"

"లేదులెండి, వస్తాను" అని సంతోషంగానే అంగీకరించింది.

"విషయం మీకు తెలుసు ననుకుంటాను" అన్నది దారిలో తనే. "ఆయన రెండోపెళ్ళి చేసుకున్నారు." అన్నది స్పష్టంగా. కంఠం దీనంగా వున్నా స్ఫుటంగా వున్నది. 'అడిగినవాళ్ళ కందరికీ, సమాధానాలు చెప్పి చెప్పీ, కాకుల్లా పొడిచే వాళ్ళందరి దెప్పుళ్ళూ వినివినీ ఈసరికి ఆమాత్రం దృఢత్వాన్ని పొంది వుంటుందనిపించింది.

"విన్నాను, చాలా విచారించాను కూడ" అన్నాను నెమ్మదిగా బాటపైననే దృష్టి నిగిడించి. దీనత్వం తిష్ఠవేసిన ఆ ముఖంలోకి సూటిగా చూస్తూ మాట్లాడగల దిట్టతనం నాలో లేదు.

విరక్తిగా నవ్వింది తులసి. "ఎవరు విచారించి ఏం చేయగలరు నాకోసం? కనీసం మీకు ఆమాత్రం సానుభూతి అయినా వున్నది నాపైన. ఇంత గౌరవంగా మీ పక్కన కూర్చోబెట్టుకుంటా రనుకోలేదు. ఆ మధ్య ఓ సారి బట్టల

దుకాణంలోకి మిసెస్‌రావూ, సవితా బెనర్జీ వచ్చారు. నన్ను పురుగును చూసినట్టే చూశారనుకోండి. నాతో మాటాడక పోగా నన్ను హేళనగా చూస్తూ వాళ్ళలో వాళ్ళేదో చెప్పుకు నవ్వుకోవడం." అన్నది.

"రకరకాల వేషాలు వేసుకు తిరగడమే కానీ, వాళ్ళెప్పుడుమాత్రం ఎక్కడమాత్రం సభ్యంగా మాట్లాడి ప్రవర్తిస్తారు? అటువంటి వాళ్ళని గురించి ఏం బాధపడక్కర్లేదు."

ఇంటికి వచ్చాక ఇద్దరం షరబత్ తాగి కూర్చున్నాం.

"ఇప్పుడేం చేస్తూన్నట్టు మరి?" అనడిగాను తులసిని.

"ఏంచేయగలనో చెప్పండి?" ఎదురు ప్రశ్నించింది. "స్కూల్ ఫైనల్ చదువుకూడా లేదు నాకు." అని జీవంలేని నవ్వు నవ్వింది.

"మీవాళ్ళెవరూ..." అర్ధోక్తిలోనే ఆపేశాను.

మళ్ళీ అదే జీవంలేని నవ్వు. "వెళ్ళాను, ఎవ్వరూ రమ్మనలేదు. కష్టంలో ఓదార్పు లేదు. అయినా నేనే వెళ్ళాను, నావాళ్లనుకొని. అన్నా వదినలే కాదు, తల్లి దండ్రులు కూడా ఎదురు నాకే సలహాలిచ్చారు. 'ఎలాగో ఓలాగు వాళ్లు పొమ్మన్నాసరే చూరుపట్టుకు వేళ్ళాడాలి. ఆడదానివి, మళ్ళీ వెళ్ళి కాళ్లమీదపడు అంటూ బుద్ధులు చెప్పారు, సలహాలిచ్చారు. ముళ్ల మీదున్నట్టు రెండు నెలలు గడిపాను. ఇక అక్కడ వుండలేను. ఎక్కడైనా ఏమైనా దొరక్కపోతుందా అని ఇలా తిరుగుతున్నాను. ఎక్కడో అనాథాశ్రమంలో వంటమనిషి పని ఖాళీగా వుందట. వెళ్ళి అడుగుదామని బయల్దేరా నివ్వాళ."

వింటూన్న నాకు కడుపులో దేవినట్లే అయ్యింది.

ఎన్నో సందేహాలడుగుదామనుకున్నాను. కానీ, అడిగి నేను చేయగలది ఏమున్నదీ? ఏమడిగితే తులసి ఏవిధంగా అర్థంచేసుకుని బాధపడుతుందో!

హఠాత్తుగా గుర్తువచ్చినట్టు తులసి కలవరపడుతూ లేచింది. "అన్నట్టు మీవాడు ఇంటికి భోజనాని కొస్తారేమో?" అంటూ.

"ఔను, అయితే?"

"నన్ను రానిచ్చినందుకు ఏమన్నా అంటారేమో! వెళ్తాను."

"ఛఛ, అలాంటి నీచనైజం కాదు." అంటూ తిరిగి కూర్చోబెట్టాను చేయిపట్టి. "కనీసం టైపూ వగైరా వస్తే ఏమైనా ఆయనకంపెనీలోనైనా ప్రయత్నించి ఏదైనా వేయిద్దురేమో! ఏది దారీ?" అన్నాను ఆలోచిస్తూ.

"చూశారా? 'ఆడదానికి చదువెందుకూ?' అంటారు ఆ పెళ్లికోసం ఖర్చుపెట్టిన దాంట్లో నాలుగోవంతైనా నా చదువుమీద వినియోగిస్తే ఈనాడు నాకీపాట్లుండేవా?" అంటూన్న తులసి దుఃఖం ఆపుకోలేకపోయింది.

ఇంతవరకూ ఆమె ప్రదర్శించిన నిగ్రహమంతాబూటకమని తెలిసిపోయింది. నిత్యశోకమేకదా ఇక ఈమె బ్రతుకు.

అంతలో కారుహారన్ వినవచ్చింది. మరునిముషంలోనే ఆయన లోపలికి వచ్చారు.

తులసి ఖంగారుగా లేచి నమస్కరించింది.

"నమస్కారం. ఎలాగున్నారు? అడుగుతూ ఎదుట కూర్చున్నారు.

"ఇలాగే" నెమ్మదిగా అన్నది, కళ్ళుతుడుచుకుంటూ.

భోజనం వడ్డిస్తూ అడిగాను. "తులసికి మీరేమైనా పని ఇప్పించగలరా?" అని.

ముఖంలో రంగులు మారిపోతుండగా అన్నారు. "ఇంట్లో కూర్చునేవాళ్లకు ఏం పని వస్తుంది బయట? పాపం, సాయంచేయాలనే వుంటుంది కానీ నిస్సహాయులం!"

నిజమే! ఈ రోజులలో ఒక సామాన్య యువతికి ఉద్యోగమా?

మరే వెర్రివేషాలూ, వెకిలి పోకడలూ వున్న దెవరైనా అయితే నాకూ ఈ జాలీ, సానుభూతీ వుండకపోను, కానీ తులసి బుద్ధిమంతనం ఎరిగున్న నా మనసు మనకెందుకీ గొడవ అని విదిలించలేకపోతున్నది.

'దామోదరం ఏమివ్వటానికి నిశ్చయమయ్యిందటా?' అనడిగాడు మళ్ళీ.

నాకు తెలియదన్నాను.

"పెళ్ళాన్ని వదిలేయడం తేలికే. వదిలేయగానే సరి కాదు. విడాకులతో పాటు కోర్టువారు భరణంకూడ ఇప్పిస్తారు. ఛస్తాడప్పుడు ఆ వచ్చేజీతం ఇటూ అటూ సర్దలేక" అన్నారు. అసహ్యం పుట్టిపడుతుండగా. నిజమే— దామోదరం చేసిన పనిని బుద్ధివున్న ఎవ్వరూ ఆమోదించలేకుండా వున్నారు.

నేనూ, తులసీ భోజనాలకు కూర్చున్నప్పుడు మెల్లగా ఆ సంగతి అడిగాను.

"అంటే, మనువర్తి మాటేనా మీరడిగేది?" ముఖం జేవురించింది. చాలాసేపు మాట్లాడకుండా అన్నం కెలుకుతూ కూర్చుంది. 'ఎందుకడిగానా!' అన్పించింది నాకు.

చాలాసేపటికి మెల్లగా అన్నది: "నేను వేరేభార్యను తెచ్చుకున్నాను, నీతో సంసారం చెయ్యను, నువ్వక్కర్లేదు" అని నిర్మొహమాటంగా నిర్దయగా బంధం తెంచుకున్నవాడి డబ్బుతో కడుపు నింపుకోని, బట్టకట్టదలచుకోలేదు అక్కయ్యగారూ. మా అన్నయ్యతో వదినతో ఇలాగే అంటే వాళ్లు హేళనచేశారు. 'ఎలా బ్రతుకుతావు మరి? ఎల్లకాలం మేమే పోషించమా?' అంటూ... నేనెవ్వరికీ అక్కర్లేదు. ఎవ్వరి డబ్బు నాకు అక్కర్లేదు. కళ్ళూ కాళ్ళూ వున్నాయి నాకు. పనిచేసుకు బ్రతుకుతాను. లేనినాడు నన్నాదుకోవటానికి చంబల్‌నది వున్నది. ఎత్తైయిన పర్వతాలున్నాయి, లోయలున్నాయి."

"ఎంతటి అభిమాన యువతి."

అప్పుడప్పుడు వస్తూండమన్న నా మాట ప్రకారం. వారానికి పదిరోజులకూ ఒక్కోసారి రావడం, పనులలో నాకు సాయపడ్తూ ఆ రోజంతా ఇక్కడే గడిపి భోజనంచేసి వెళ్తూండడం చేస్తోంది తులసి.

ఆరోజూ అలాగే వచ్చింది తులసి.

ఆ రాత్రి ఎవరెవరికో డిన్నర్ వుంది. అంచేత తల మునకలయ్యే పనిలో వున్నాను నేను.

"హమ్మయ్య, వచ్చావా? ఇక నాకు భయం లేదు. పదిమంది కాదు, వందమందికైనా భోజనాలు పెట్టేయవచ్చు. ఆ ఫ్రిజ్‌లో బఠానీలు, పాలూ ఇలా తీసుకు రద్దూ !" అన్నాను.

సమాధానం రాక అటు తిరిగి చూచాను. భిన్నవదనురాలై నిలిచివుంది తులసి.

"ఏం తులసీ, మళ్ళీ ఏం జరిగిందీ?" ఆత్రంగా అడిగాను.

"ఇవ్వాళ కొంచెం పనివుంది అక్కయ్యగారూ, ఇక్కడుండలేను" అన్నది చాలా దీనంగా.

"పోనీలే, నేనెలాగో సర్దుకుంటాను కానీ... అలాగున్నావేమిటీ? వంట్లో బాగుందా?"

తల వంచుకుని జవాబిచ్చింది. "బాగానే వుంది. నాకొక్క... వందరూపాయలు సర్దగలరా? భగవంతుడనుకూలిస్తే తిరిగి ఇవ్వగలను. కానీ నమ్మకంలేదు కదా, అందుకే అప్పుగా అడగడంలేదు. మీరు తప్ప నాకు అడగగలవారు కూడా వేరెవరూ." అంటూన్న ఆమె కనులు జలపూర్ణాలయ్యాయి.

పరీక్షగా చూచాను. లోలోన చాలా అలజడితో వున్నట్లుందామె రూపం.

"ఏమిటసలు సంగతి, ఇస్తానులే డబ్బు. కాని దాపరికం లేకుండా చెప్పు. అలా పీటమీద కూర్చో."

టీ తాగి, నెమ్మది నెమ్మదిగా చెప్పసాగింది తులసి : "అనాథాశ్రమంలో వంటపని ఖాళీగా వుందంటే వెళ్ళాను.

దొరికింది. అంత తేలికగా దొరకడం నాకే ఆశ్చర్యమనిపించింది. తిండీ బట్టా అంతా అక్కడే గడిచిపోగా నెలకి ఎనభై రూపాయలిస్తామన్నారు. ఒప్పుకున్నాను. మా అన్నయ్యా వదినా తాడెత్తున లేచారు. 'పరాయి పంచల్లో వంటపనికీ పాకీపనికీ తలొగ్గగలదానవు మొగుడింట అణగిమణగి ఏ మూలో దాసీదానిలా పడుంటే కాకపోయిందా? నడు, మేం తీసుకెళ్ళి మీ ఆయనదగ్గర దిగవిడిచివస్తాం ఎలాగో నచ్చజెప్పి. మా ఇంటవుండి ఇలాంటి కూలీనాలీ పనులు చేయటానికి వీల్లేదు'' అన్నారు. మీరే చెప్పండి అక్కయ్యగారూ, నేనేమైనా నాఅంత నేను వెళ్ళిపోయానా ఆ ఇంటినుంచి?'' దీనంగా చూచింది.

"అయితే వాళ్ళే వెళ్ళిపొమ్మన్నారా?'' ఇంతవరకూ ఈ వివరాలేమీ నాకు తెలియవు. అందుకే సందర్భం తనే తెచ్చిందిగనుక అడిగాను.

"ఆయన, తల్లి, అక్కచెల్లెళ్ళు అందరూ కూడ ఎవరు పెట్టగలిగినంత హింస వాళ్ళు పెట్టారు. నా ఎదుటే దాన్ని - ఆ రెండో పెళ్ళాన్ని - ఇంటికి తీసుకురావడం, తల్లీ చెల్లెళ్లూ దానికి మర్యాదలు చేయడం, ఇదికూడా సహించాను. నా తరఫున అడిగి ఆర్భాటంచేసి ఆరళ్ళుపెట్టే సమర్థులెవరూ లేరని వాళ్ళకి తెలిసిపోయింది. నా పుట్టింటివాళ్లు నోరు మూసుకు ఊరుకోవడంతో 'గొడ్రాలు, వంశాంకురాలు, వేరుపురుగు' నిత్యం ఇటువంటి మాటలతోటే సత్కరించేవారు. అన్నిటికీ దిగమ్రింగి ఊరుకున్నాను 'నా ఖర్మ' అను

కుని. ఎదిరించి బ్రతకలేనని తెలుసునాకు. ఎన్ని ఉత్తరాలు రాసినా అన్నయ్యకానీ, నాన్నగారుకానీ జవాబీయలేదు. 'ఆడదాని బ్రతుకే కష్టాలమయం' అని ఎన్ని బాధలైనా ఓర్పుతో సహించ గలిగినదే ఆయినింటి 'ఆడ'దనీ అమ్మ ఏమేమో వ్రాసింది.

"ఏంచేయను? నాలోనేనే ఏడ్చి ఊరుకున్నాను. ఎన్నో సార్లు గదిలో ఆయన్ను ప్రాధేయపడి అడిగాను. ఏడ్చాను. మొదట్లో మౌనంగా వుండిపోయేవారు. రానురాను 'నిద్ర పోనీయకుండా ఏమిటీగోల' అనీ 'అనుమానాలతో పీడిస్తున్నా'నని విసుక్కొనేవారు. ఎంతచేసినా ఇంకా ఏదో పని చేయించేది. అర్ధరాత్రివరకూ నాచేత అత్తగారు. ఆడబిడ్డల సతాయింపులు ఎక్కువైపోయాయి. అర్ధరాత్రివేళకు నేను వెళ్ళేసరికి ఆయన గాఢనిద్ర పోతుండేవారు. ప్రొద్దున్నే లేచి ఎటో వెళ్ళిపోయేవారు ఇక మాకు మాట్లాడుకొనే అవకాశమే వుండేదికాదు.

"ఇలా కొన్నాళ్లు జరిగాక నాకు అసలు విషయం తెలిసింది. దయగల ప్రక్కింటావిడ చెప్పిందానాడు: "అయ్యో, వెఱ్ఱిపిల్లా, పదిరోజులనాడే రిజిష్ట్రాఫీసులో పెళ్లిఅయిపోయిందే ఇద్దరికీ. ఈవేళ దాన్ని ఇంటికి తీసుకొస్తాడు" అంటూ.

"పిచ్చిదానిలాగై పోయాను, అందరినీ తిట్టేశాను ఏడుస్తూ. ఆ ఘోరవిపత్తు రానేవచ్చింది. దాన్ని-ప్రమీలని వెంటబెట్టుకొచ్చారు సాయంత్రం. ఇల్లంతా పండగగా వుంది. నేనలాగే రాయిలా కూర్చున్నానుగదిలో. మెదడూ మెదడూ మనసూ మొద్దుబారిపోయాయి. రాత్రి తొమ్మిది

గంటలకు పెద్ద ఆడబిడ్డవచ్చి నన్ను గది బయటకు పిలిచింది. నేను కదలలేదు.

"కదలకపోతే బలవంతంగా ఈడ్చవలసి వుంటుంది. మర్యాదగా బయటకువచ్చి వరండాలో పడుకో" మన్నది.

సిగ్గు లేకుండా ఎప్పుడు పుట్టింట పడుండే కుక్కా, నా కాపురానికే గోతులు తీశావా?" అంటూ బల్లమీా దున్న మంచినీళ్ళగ్లాసు విసిరేశాను. ఆమె ముఖాన రక్తం చిమ్మింది.

అందరూ మూగిపోయారు.

"చూడరా తమ్ముడూ, నీ గొడ్డుమోతు పెళ్ళాం ఏంచేసిందో?" అంటూ రాగాలు ప్రారంభించింది.

"ఆ అసమర్థుడు వచ్చి నన్ను గొడ్డును బాదినట్టు బాది బయట వరండాలోకి ఈడ్చిపారేశాడు. అత్త ఆనందంగా చూచింది. మామా, మరదలూ మూగి వెథవల్లాగా ఊరు కున్నారు. మొగుడే దరిద్రుడైతే ఇక తక్కిన దేభ్యాల గురించి ఏం ఏడిచేదిలెండి.

"దాని కేదో ఏర్పాటుచేసి పీడ వదిలించేయండి. రోజూ ఈ గోల కుదరదు నాకింట్లో" అంటూ స్పష్టంగా చెప్పిందది—ఎవరు? నా కాపురం పడగొట్ట వచ్చిన ఆ చదువుకున్న టక్కులాడి. ఛీ. దానిదీ ఓ బ్రతుకేనా? మరొకతె మొగుడేకాని దొరకలేదా ఈ ప్రపంచంలో దానికి? ఇలాటి వాళ్ళని నిలువునా నరకాలి నాలుగు వీధుల మొదలో పెట్టి."

తులసి ఉపయోగిస్తున్న ప్రతి పదమూ ఆమె ఎద

లోని దావానలపు తీవ్రతను స్పష్టీకరించుతూన్నది.

తులసి ఇంకా చెప్పసాగింది. "ఆ మర్నాడు నాకెవళ్లూ తిండికూడా పెట్టలేదు. అంత నీచంగా చూడబడుతూ కూడ ఆ ఇంట్లో మరో వారం రోజులు గడిపానంటే మీరు నమ్ముతారా అక్కయ్యగారూ? ఇలా వీధిన బడకుండా వుండాలనే అంత అవమానాన్నీ బాధనూ దిగమ్రింగుకుని అలా పడున్నాను. అయినా వాళ్లు నన్ను కనికరించలేదు. ఆఖరికి ఏదో 'స్లో పాయిజన్' ఇచ్చి నన్ను అంతంచేయాలనే పథకంలో వున్నారని పసిగట్టి ఆ యింటి నుంచి పారిపోయి ప్రక్కింట్లో తలదాచుకుని, తర్వాత రహస్యంగా మా వాళ్ళింటికి పారిపోయాను! ఇంత విన్నాక కూడా మీకు నేను తొందరపడ్డాననే అన్పిస్తోందా అక్కయ్యగారూ?"

నిర్ఘాంతపోయి వింటున్నానే కాని నేను సమాధానం ఈయగల స్థితిలో లేను.

"ఇటువంటి నరకంలో మళ్ళీ నన్ను తీసుకెళ్ళి పడేస్తామంటున్నారు. అన్నయ్యా వాళ్ళూ! కానీ.....కానీ... నావంటివాళ్లు ఛస్తే లోకానికేం లోటులేదు కానీ ఎందుకో నాకింకా చావాలని లేదండీ. అక్కడికెళ్తే వాళ్ళు నన్ను చంపేస్తారు!" అంటూ చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడ్చింది.

నాకూ కనుల నీళ్ళు తిరిగాయి.

"పోనీండి. కాపురం ఎటూ పోయింది. అందుకు నాకు బాధలేదు. ఇన్నాళ్ళూ ఇటువంటి చవటకు-కట్టుకున్నదాన్ని నడివీధిలోకి నెట్టివేయగల దౌర్భాగ్యుడికి కాపురం చేశానే-

శూర్పణఖలకు ఊడిగం చేస్తూ 'అత్తయ్యా' 'వదినా' అంటూ నోరు పాడుచేసుకున్నానే - అనే నా బాధ. ఎలాగో ఓ లాగు బ్రతుకుతాను." అంటూ కళ్ళుతుడుకు నవ్వింది.

నాకు భయం వేసింది 'భగవాన్! తులసి పిచ్చెత్తి పోదుగదా!'

"మరి ఆ వంటపని ఏమైంది?" అనడిగాను.

"ఒప్పుకున్నాను. కానీ వంటచేయాల్సింది ఆ అనాధాశ్రమంలో కాదట. జీతం ముట్టినట్లూ, బట్టలు ముట్టినట్లూ ఆశ్రమం రికార్డులలో సంతకం పెట్టాలట. పనిచేయాల్సింది మాత్రం దానికి ప్రెసిడెంటో - చైర్మనో ఎవడో వాడింట్లో నట. తిండి మాత్రం పెడతారు......అందుకు కూడా ఒప్పుకున్నాను."

"మరి?"

నేలచూపులు చూస్తూ చెప్పింది. "మొదటిరెండ్రోజుల్లోనే తెలిసిపోయింది. అతడి భార్య రోగిష్టిది, మంచాన పడివుంది. చిన్నచిన్న పిల్లలున్నారు. నలుగురు......అతడి ప్రవర్తన చాలా చెడ్డగా వుంది. నిజానికతడు వంటకు మాత్రమే నియమించుకున్నట్లు లేదు. యుక్తిగా తప్పించుకు బయటపడ్డాను."

"ఇంకా ఏమైంది? ఇలాటి రాబందులూ గ్రద్దలూ ఎన్ని తారసపడతాయో భవిష్యత్తులో?"

"ఆ నౌఖరీకోసం బయట అడుగుపెట్టిన క్షణంలోనే పుట్టింటికీ నాకూ బంధం తెగిపోయింది. ఇకనేను వెళ్ళినా వాళ్ళు రానివ్వరు కదా!"

"ఇప్పుడేం చేద్దామని?"

"ఎక్కడైనా ఓ గది తీసుకుని వుంటాను. మరో నౌఖరీకోసం తాపత్రయపడతాను. అందుకే మిమ్మల్ని డబ్బు అడుగుతున్నాను."

'తెగిన గాలిపటమై పోయిన తులసికి నేను దారి చూపలేను. సలహా ఇవ్వలేను. కనీసం......కనీసం వుండ టానికి ఆశ్రయమీయలేనా?' ఆలోచించాను! నాకు సాయంగానూ వుంటుంది. తనకి భుక్తీ గడిచిపోతుంది. 'ఎక్క డికో పోయి ఒంటిగా ఏం బ్రతుకుతావు, ఎలా అవస్థలు పడతావు? ఏదో దారి దొరికేవరకూ ఇక్కడే వుండిపో' అని నోటి చివరివరకూ వచ్చినమాటనే అణచివేశాను. వద్దని అనరు; ఎంతో జాలిగుండె మనిషే, అయినా ఇలాటి పనికిముందు ఆయనతో ఒక్కమాట అనాలికదా! అందుకే నా మనసులోని భావాన్ని, ప్రతిపాదననూ ప్రస్తుతానికి గోప్యంగానే వుంచాను.

"సాయంత్రం వెళ్ళువుగానిలే తులసీ, కనీసం మధ్యా హ్నం వరకైనా వుండు" అన్నాను. ఈ లోపుగా అయన రానేవచ్చు - లేదా కనీసం ఫోన్ అయినా చేసి మాటలాడ వచ్చుననే ఉద్దేశ్యంతో.

అంగీకరించింది తులసి.

ఇద్దరం చెరోపనీ చేసుకుంటూండగానే టైము తెలి యకుండా మూడు అయిపోయింది.

"నాకు చాలా బిజీవర్కు వుంది. భోజనానికి రాను" అని ఫోన్ చేశారు. పక్కనే తులసి వుండడంవల్ల ఏం

మాట్లాడటానికీ లేకపోయింది.

భోజనానికి రాసని సాయంత్రం మూడు గంటలకా ఫోను చెయ్యడం, ఏంమనిషి? పన్నెండింటినుంచి నేను ఎదురు చూస్తుంటానని తెలియదూ!" విసుక్కుంటూ ఫోన్ పెట్టేశాను.

"మీ రాయనకోసం ఎదురు తెన్నులు చూస్తూంటా రనీ, కనీసం ఆలస్యంగానైనా మీకా విషయం చెప్పాలనీ అన్పించింది. అంత బిజీగా వున్నప్పుడు కూడా ఆయన గుండెలలో మీరుమెదుల్తున్నారంటే అదృష్టవంతులుకాదా అక్కయ్యగారూ?" అంటూన్న తులసి కనులలో దిగులు వర్షించింది.

భోజనంచేసి ఒక్క అరగంటైనా కూర్చోకపోతే వీల్లే దన్నంతగా అలసిపోయా నివాళపనితో.

తులసి ఏదో కబుర్లు చెప్తూ కూర్చుంది సోఫాలో. నేను పేపరు చేతబట్టి ఈజీచైర్లో ఇలా వాలానోలేదో అలా వీధిలో కారుహారన్ వినరావడం, కొలది క్షణాలలోనే బిల బిలా సీతాకోక చిలుకల బృందం లోపలికి రావడం జరిగింది.

సవితా బెనర్జీ, కాలేజీలో చదువుతూన్న ఆమె కుమార్తె కవిత, మిసెస్ దయాబాయి పటేల్, షీలామల్ హోత్రా, రావూ, మిసెస్ రావూ, మీనా టాండన్, టాండన్.

"హతోస్మి" అనుకుంటూ లేచాను. విరామంగా కూర్చోవాలని నా కన్పించినప్పుడే ఇలా ఎవరో దండెత్తు

తుంటారు.

వాళ్ళని చూస్తూనే తులసి లోపలికి పారిపోయింది.

"చాలా షాపింగ్ చేశాం. సరే ఇలా మిమ్మల్ని కూడ చూసిపోదామనీ... ఏంచేస్తున్నారు?" అంటూ భారీ శరీరాలను సోఫాలో చేరవేశారు.

చల్లని పానీయాలను సేవించాక సంభాషణలు చిత్తం వచ్చిన రీతిని కొనసాగించారు.

"మేమిన్నిసార్లు వచ్చాం. మీరెప్పుడూ రారు మా ఇంటికి." మిసెస్ పటేల్ ఆరోపించింది.

"ఎప్పుడూ ఇంట్లో ఎలాతోస్తుంది?" మిస్ కవిత ఆరా. నవ్వి ఊరుకున్నాను నేను.

"ఆఁ... బై ది బై......" షీలా ప్రారంభించింది. "మిసెస్ దామోదరం ఎందుకలా పారిపోయింది మమ్మల్ని చూచి?" డేగలా లోపలికి కనులు చిలికించి చిలికించి చూడ సాగింది.

నేను సమాధానం చెప్పే లోగానే సవితా బెనర్జీ ప్రారంభించింది: "అసలామెకూ మీకూ అంత దోస్తీ ఏమిటీ? మీకామె అసలెలా పరిచయం?"

"దోస్తీ ఏముంది ? మనందరికీ ఆమె పరిచయస్థురాలే కదా? మీ అందరితో వున్న దోస్తీ వంటిదే ఆమెతోనూ వున్నది" అన్నాను.

ఈ మాట విని ఎవ్వరి ముఖమూ బాగులేదు.

"ఏమోలెండి. మొగుడొదిలేశాక మా ఎవ్వరిళ్ళకీ

రానేలేదు. మరి మీ ఇంట్లో రోజులు రోజులూ వుంటు న్నట్టు వింటున్నాం" అన్నది షీలా.

"ఎందుకిలా మాట్లాడతారు కొందరు?" అనుకొంటూ నివ్వెరపాటుతో చూడసాగాను నేను. తులసి వింటే ఎంత బాధపడుతుందీ?

"మీ ఇంట్లో ఏమైనా ఆయాంగాగాని కుదిరిందా?" మరొకామె ప్రశ్న.

అంతలో లోపల నుంచి తులసి బాణంలా దూసు కొచ్చింది. "మీ అందరిలాగా కాకిలా పొడవకుండా ఆవిడ నాకు కాస్త సానుభూతి చూపుతుంది. అందుకే ఆమెగారి దగ్గరకు వస్తున్నాను. ఇందులో మీరంతా అంతగా వింతగా చూచి విడ్డూరంగా అడగాల్సిన దేముందీ?" అన్నది షీలా ముఖంలోకి తీక్షణంగా చూస్తూ.

ఈసారి మరింత ఆశ్చర్యపడ్డాను. 'నలుగురు కూర్చు న్నప్పుడు తలెత్తటానికీ, కుర్చీలో సరిగా కూర్చోవటానికే ఇబ్బందిపడిపోయే మొగమాటస్థురాలు తులసేనా ఈమె? అనుభవాలు స్వభావాలను ఎంతెంత తీక్షణంగానైనా మార్చ గలవు. గంగిగోవు కూడా చీల్చి చెండాడే పెద్దపులి కాగలదు!'

"బాగుంది; మాకేం కాకుల్లా పొడవటానికి ? ఎవరి ఖర్మ వాళ్ళదీ. ఉన్నమాటకి ఉలుకెందుకూ?" షీలా, సవితా గొణుక్కున్నారు.

"మీరేం చేస్తున్నారిప్పుడూ? పాపం, చాలా కష్టమే వచ్చింది మీకు." మనస్సులో ఏముందోకాని పైకి మాత్రం

సానుభూతితోనే పరామర్శించాడు టాండన్ తులసీని.

తులసి నవ్వుముఖంతోనే జవాబిచ్చింది. "ఇంకా ఏం నిశ్చయించుకోలేదు. నిన్నమొన్నటివరకూ నేనూ ఈఅందరి లాగానే నవ్వుతూ తుళ్ళుతూ బ్రతికాను, భవిష్యత్తును గురించి భయమేలేకుండా. ఎప్పుడు మొగుడు చస్తాడో లేదా చచ్చిన వాడితో సమానమైపోతాడో తెలియదు కదా? ఇవ్వాళ పచ్చగావున్న చెట్టు రేపు మాడిపోతే దానిమీద పక్షులు వెనక్కు చూడకుండా ఎగిరిపోయినట్టే, సాటి ఆడదాని జీవితం నట్టేటకలిస్తే స్నేహితులూ అయినవాళ్ళూ కూడా వదిలేసి ఇంకా నాలుగురాళ్ళు విసుర్తారు. అంతేకాని, ఏమో-రేపు ఇదేగతి మనకూపడ్తే మనమేంచేస్తాం? అనేయోచన కాస్త వుంటే ఈవిధంగా మాట్లాడేవారేకాదు ఎవరూ."

"బాగుంది, బోడిదానికి దణ్ణంపెడ్తే 'నాలాగే వర్థిల్లు పదికాలాలపా'టని దీవించిందట." మిసెస్ రావుతగ్గుస్వరంలో అన్నప్పటికీ ఆ భాష నాకేకాని అక్కడ మరెవరికీ తెలియని దైనప్పటికీ ఆ ముఖంలోని క్రోధాన్నిబట్టి అదేదో దూషణా భాష అని అందరకూ తెలుస్తుంది.

"మనకెందుకు గోల? రండి పోదాం." అందరూ బిల బిలలాడ్తూ లేచారు.

వీళ్ళంతా ఒకనాడు తులసితో సరసంగా మాట్లాడ్తూ ఇంటికి రాకపోకలు సాగించుతూ వుండేవారే. ఎంతలో ఎంత మార్పు !

మర్యాదకు గేటువరకూ వెళ్ళాను సాగనంపటానికి.

మీనా కొంచం వెనుకగా వుండిపోయి నాతో గుస

గుసలుగా అన్నది. "అలాచూడండి ఎంత సిగ్గులేనితనమో!"

ఏమిటో అని అటు చూచాను. కారు దగ్గర సవిత టాండన్‌తో ఏమిటో విరగబడి నవ్వుతూ చెప్తోంది. అతడు శ్రద్ధగా వింటున్నాడు, ఆమెనే దీక్షగా చూస్తూ. చీరచెరగు వుండవలసిన స్థానంలో లేదు. ఆమె నవ్వుకు చిత్రవిచిత్రంగా ఒళ్ళంతా కదిలిపోతోంది. పక్కనే చెట్టంత కూతురు కవిత. ఆ నడిరోడ్డుపైనే మేకప్ సరిజేసుకుంటోంది. హాండ్‌బాగ్ తెరచి.

మరో అడుగుదూరంలో మిసెస్ దయాబాయి మిస్టర్ రావు భుజంమీద చేయివేసి మరీ ఏమిటేమిటో ఎడతెగని సోదిగా చెప్తోంది.

"తనను మించిన పిల్లల్ని పెట్టుకొని కూడా ఒక్కొ తెకూ ఎంతెంత విరగబాటో చూడండి మగాడంటే. ఛీ." అంటూ అక్కసుగా అన్నది మీనాటాండన్.

ఆమె మాట నిజమే. ఆ దృశ్యం చూడటానికి ఎబ్బెట్టు గానే వున్నది. కాని, ఇంతగా వాళ్ళను అసహ్యించుకుంటూ ఈమె వాళ్ళతో కలసి ఎలా తిరగగలుగుతోందీ. ఎందుకు తిరుగుతూన్నట్టూ? ఇవే నాకు నేటి సమాజంలోని అర్థం కాని ఫార్మాలిటీస్.

ఇంకా రహస్యంగా తగ్గుస్వరంతో అన్నది షీలా. "మీకు తెలుసో తెలియదో - కవితని ఆ ఇండస్ట్రియలిస్ట్ అనిల్ కైతాన్‌కు పెర్సనల్ సెక్రటరీగా చేయాలని తాప త్రయపడ్తున్నారు బెనర్జీ దంపతులు. ఆ విధంగా వాడిఐశ్వ ర్యాని కంతకూ గాలం వేస్తారన్నమాట!"

విని ఊరుకున్నాను, వ్యాఖ్యానించవలసిన అవసరం కన్పించక.

"వెళ్తాను మరి." ఇప్పటికి నాలుగుసార్లు ఈ పదం విన్పించడమే కానీ వెళ్ళడం జరగలేదు. మరోసారి వెనక్కు వచ్చింది మీనా. "మీక్షేమం కోరేదానను గనుక చెప్తున్నాను. తులసిని ఆట్టే చేరనీయకండి. మన సంసారాల సంగతి మనం కాస్త ఆలోచించుకొని జాగ్రత్తపడాలి. వయస్సులో వున్న దాయే! ఏమో- తా చెడ్డకోతి వనమెల్లా చెరిచిందని..."

ఈ అర్థోక్తిలో అనేకవేల సూచనలనూ ప్రశ్నలనూ నా మెదడుపై నిర్దాక్షిణ్యంగా వదిలివేసి నిష్క్రమించింది మీనా టాండన్ బృందం.

ఈ ఉదయమే కదా తులసిని నేను 'మా ఇంట్లోనే వుండిపో' మ్మని చెప్పాలనుకున్నాను! అదే గనుక జరిగితే వాళ్ళంతా ఇలాగే నోటికివచ్చినట్టు వాగి వ్యాఖ్యానించి వదంతులు లేవదీస్తారా?

తులసికి ఆశ్రయం కల్పించబోయిన నా ఆలోచన మొగ్గలోనే తృంచివేయబడింది. మన మంచితనాలపై, నిర్మలత్వంపై మనకెంతైనా గురీ నమ్మకమూ వుండవచ్చు కానీ, సంఘం మాటకు కూడా కొంత విలువ ఇవ్వాలికదా!

"తులసి నా అతిథి. ఆమెను నా యింట మీరెవరూ అవమానించటానికి వీల్లేదు" అని వాళ్లతో స్పష్టంగా ఎందుకనలేకపోయాను నేను?

నేనుకూడా ఈ సమాజంలో ఒకతెను గనుకా?

కనులు తుడుచుకుంటూన్న తులసిని ఓదార్చాను

"పోనిద్దూ. చూశావ్ కదా - అసలు మేనర్స్ అనేవే తెలియవు. ఇక వాళ్లనుగురించి నువ్వెందుకు పట్టించుకోవాలి?"

## 3

దసరా మేలా ఘనంగా జరుగుతోంది ఊరిబయట మైదానంలో. ఒక ఆదివారం పిల్లల్ని తీసుకుని వెళ్ళిన మాకు అక్కడ తులసి కలసింది చిత్రంగా. వెంట నలుగురు పిల్లలున్నారు. ఎంతో ఆప్యాయంగా వాళ్లకి ఎస్క్రీంలు కొని పెట్టి రంగులరాట్నంవేపు తీసుకు వెళ్తూన్నది. నా పిలుపు వినిపించలేదామెకు. మేం అటు వెళ్ళేసరికి అక్కడ టిక్కెట్లు కొని రంగులరాట్నం ఎక్కేసింది పిల్లలతోసహా. తెగ నవ్వుతోంది ఆ పిల్లలతో సరిగా ఆనందంగా.

చూస్తున్న మాకు చాలా ఆశ్చర్యమన్పించింది. తులసి అసలు మరలా జీవితంలో ఇలా నవ్వగలుగుతుందని నేననుకోలేదు. పోనీపాపం, ఎవరో బంధువులు చేరదీసినట్లున్నారు సంతోషంగా వుంది - అనుకున్నాను.

రంగులరాట్నం ఆగింది. దిగివస్తూనే మమ్మల్ని చూచి సంతోషంగా మర్యాదగా నమస్కరించింది.

"బాగున్నావా, ఎక్కడా రావటంలేదు." అన్నాను పలుకరింపుగా.

"ఆఁ ఇలాగే, ఇదుగో. ఉద్యోగం దొరికింది. ఖాళీ వుండడంలేదు, రావటానికి... ఈపిల్లల్ని రోజంతా సంరక్షణ,

స్కూలుకు పంపటం, తీసుకురావడం— అంతా నాపనే అనుకోండి. ఏదో సుఖంగానే జరిగిపోతోంది."

"ఇంతకీ ఎవరింట్లో?" నా ప్రశ్న.

చెప్పింది. "ఆయన పెద్ద ఆఫీసర్. ఆమెగారికి ఇంటా బయటా పార్టీలూ హడావుడీ తీరికే వుండదు. వున్నా కుర్చీ దిగరు. వంటమనిషి, మాలీ, నౌకర్లు డ్రైవరూ చాలామంది వున్నారు! ఆయానుగా నేనున్నాను. బాగానే చూస్తున్నారు. నాకు సర్వెంట్స్ క్వార్టర్ ఇచ్చారు. ఏదో బ్రతుకు వెళ్ళిపోతోంది."

"బాగానే చూస్తున్నారు, బాగానే వున్నాను" అని పదిసార్లు చెప్పిందేకాని ఆ కనులలా ఏదో దిగులు కొట్టవచ్చి కట్టు కన్పిస్తూనే వుంది.

"ఈరోజు ఇంట్లో ఎవరో మంత్రిగారికి పార్టీ ఇస్తున్నారు, అంచేత పదకొండువరకూ పిల్లల్ని బయట త్రిప్పి తీసుకెళ్తాను. పదకొండుకు కారూ డ్రైవరూ వస్తారు."

"వాళ్ళని నేనూ చూచాను. ఊళ్ళో చాలా పలుకుబడి వున్నవాళ్ళే. వేషభాషలూ పద్ధతులూ అంతా కూడ అల్ట్రామోడర్న్ అన్నమాట!" అన్నాను.

"ఔను. మీకు తెలియనిదేముంది? ఎక్కువ మాట్లాడితే పిల్లలు పసిగట్టి ఇంట్లో చెప్పగల ప్రమాదముంది. వస్తాను మరి."

"అలాగే."

"చూడండి." మళ్ళీ వెనక్కు వచ్చింది. "ఎప్పుడైనా

తేనేం— మొత్తం ఓ రెండువందలివ్వాలి నేను. మెల్లమెల్లగా తీర్చుకుంటా." అన్నది మందస్వరాన.

చాల్లే, నేనడిగానా? ఆ విషయం మర్చిపో. ఎక్కడో ఓ చోట నీకు కాస్త అవలంబన దొరికింది. అదే నాకు తృప్తి."

ఇంటికొస్తూ దారిలో అన్నాను నేను. "తులసి చూస్తే బొత్తిగా పూర్వకాలపుది. ఆ ఇంట్లో అన్నీ అధునాతన పద్ధతులు. ఆవిడ కూడా త్రాగుతుంది మగవాళ్ళతో సమంగా. రెండు మూడు పార్టీలలో చూశాను. తులసి ఆయింట ఎక్కువ కాలం నిలవలేదేమో ?"

"నేనూ అదే అనుకుంటున్నాను. కాని......జీవితం వెళ్ళదీసుకోవాలి కదా. నచ్చకపోతే మాత్రం ఏం చేస్తుంది పాపం ?" అన్నారు.

మా అభిప్రాయం సరైనదే కానీ అంచనా మాత్రం పూర్తిగా తప్పని ఋజువుచేసింది పదిహేను రోజుల అనంతరం వచ్చిన తులసి సంభాషణ.

పిల్లలకు పళ్ళూ, బిస్కట్లూ తెచ్చింది.

"ఎందుకివన్నీ తులసీ ?" అని కోప్పడ్డాను.

"కష్టకాలంలో ఆదుకున్నందుకు" అన్నది.

"ఏం ఆదుకున్నాను, నాల్గురోజులు ఆశ్రయంకూడా ఈయలేకపోయాను కాకిమూకకు జడిసి! "

"ఇలా వచ్చేంత తీరికెలా దొరికింది ?" అనడిగాను.

"వారంతా ఎక్కడికో ఊళ్లుచూడ్డానికి వెళ్తున్నారు.

నాల్గురోజులు నాకు తీరికే.

"మరి పిల్లల్ని చూడటానికి వెంట నీవక్కర్లేదా ?"

"ఏమోనండీ. వారివన్నీ చిత్రమైన పద్ధతులు, మరో రెండు కుటుంబాల వారూ వీరూ కలసి రెండు కార్లలో వెళ్తారు! ఖాళీ లేకనా అంటే కాదు. అక్కడ జరిగేవి నౌకర్లకు తెలియరాదని అనుకుంటాను."

"ఏం జరుగుతాయీ?" అర్థంకాక అడిగాను.

"చెప్పకూడదనుకోండీ. కానీ మీరేకదా—అందుకు చెప్తున్నాను. వాళ్ళంతా చాలా విపరీతంగా ప్రవర్తిస్తారు. ఆయన ఇంట్లో లేకపోయినా సరే, ఊళ్ళో లేకపోయినా సరే అతడి స్నేహితులట - పెద్ద బిజినెస్ వాళ్ళట – రాత్రిం బవళ్ళూ ఆమెతో గడుపుతారు. ఆమె తాగుతుంది. వాళ్లూ తాగుతారు. అటువంటి రోజులలో ఆమెగారు పిలిస్తేనే కాని మేమసలు ఆవిడ గదులవైపు - పై అంతస్థులోకి వెళ్ళరాదు.

ఆయనా అలాగే తప్పతాగి ఇల్లు జేరుకుంటాడు ఏ తెల్లవారు ఝామునో...ఆదివారం ఉదయం మాత్రం ఇద్దరూ పిల్లల చదువులెలావున్నాయో ఏమి కావాలో తెల్సుకుంటారు. పిల్లలకు జ్వరం వచ్చినా నేనే చూచుకోవాలి. కనీసం రాత్రుళ్ళైనా ఆరోగ్యంగాలేని బిడ్డదగ్గర పడుకోదావిడ."

"పోనీలే. ఈ నాల్రోజులూ మంచి విశ్రాంతి దొరికింది."

కొంచెం సేపు ఏదో 'చెప్పనా వద్దా' అన్నట్టు తట

డటాయిస్తూ వుండిపోయింది. ఆఖరుకు చెప్పింది! "మొన్న పిల్లల్ని పార్కుకు తీసుకువెళ్ళాను సాయంత్రం. అక్కడ అతను...కొత్తభార్యతో కన్పించాడు."

"దామోదరంగారా?"

"నేను తప్పించుకొని పోబోయినా అతడు తనంతతానే వచ్చి దారి కడ్డుగా నిలబడి మాట్లాడాడు."

"ఏమనీ?" కుతూహలంగా అడిగాను. "ఏమైనా మనస్సు మారిందటా?"

"ఆ రాక్షసులకు మనస్సు మారుతుందా? నేనూ అలాగే ఆశపడ్డాను. పోనీ దయదలచి రమ్మంటే అలాగే పోదాం. ఈ లోకం అందరిచేతా అవమానింప బడేకంటే భర్తచంపేసినా చచ్చిపోదామనుకున్నాను. కాని ఆ పాషాణాలలో మార్పు రాదండీ."

"మరి ఏమిటి మాట్లాడాడు?"

"ఇంకా ఈ ఊళ్లో వుండి ఏమిటి చేస్తున్నావూ?" అని ముఖం మటమట లాడించుకుంటూ అడిగింది ప్రమీల.

"ఏం ఇది నీ బాబు 'రాజ్యమా? నీకేం బాధ?" అన్నాను.

"సిగ్గూ శరం వదిలి పెట్టేసినదానికి మాటలకేం లోటు?" అన్నది.

"సాటిదాని కాపురం నిలువునా కూల్చే నీలాటిదాని కంటె సిగ్గూ శరమూ లేనిది ఈ ప్రపంచంలో వుండ" దన్నాను నేను.

అతడు కల్పించుకున్నాడు. "ఓ! కారూ, డ్రైవరూ మంచి మంచి బట్టలూ...గొప్పవాడినే పట్టావే!" అన్నాడు హేళనగా.

"ఎటో పోరాదా? ఎందుకిక్కడ ఈ కూలీనాలీచేస్తూ నా పరువు తీయటం? నెల్లాళ్ళలో పోకపోయావంటే నువ్వీ వూళ్ళో ఎలావుంటావో చూస్తా నన్నాడు బెదిరింపుగా... నేను మాట్లాడకుండా వెళ్ళిపోయాను—పిల్లలూ, డ్రైవరూ చూస్తున్నారన్న భయంతో."

చెప్తూన్న తులసి ముఖం జేవురించింది. పెదిమలూ, కంఠమూ ఆవేశంతో వణకసాగాయి.

"పిల్లలు కలగకపోవటం నా దోషమా? నిర్ధయగా నన్నీ ప్రపంచంలో తోడేళ్ళ నడుమ వదిలేసి పైగా పరువుగా బ్రతకమంటున్నాడు. ఎలా పరువుగా బ్రతికేది?" వలవలా ఏడ్చింది.

ఆర్ద్రంగా చూడటం మినహా నేను చేయగలిగిన దేముంది?

"పరువు కావాలికదూ వాడికి?" గబగబా కళ్ళొత్తుకుని మాటాడుతున్న తులసి కనులలో నే నెన్నడూ చూడని కక్షా క్రౌర్యాలు కన్పట్టి నా మనసు అలజడి చెందింది.

"చూడండి. వాడి పరువు నిలువునా తీస్తాను. నా కక్ష తీర్చుకుంటాను. ఎలా పరువు మర్యాదలతో బ్రతుకుతాడో ఎలా ఆ క్రొత్తపెళ్లాంతో కులుకుతాడో నేనూ చూస్తాను."

'వెర్రిది! కోపంలో ఏదో అంటోంది కానీ నిరాధారు

రాలైన అబల ఏమిటి చేయగలదు ఇనుప స్తంభంలాంటి మగ వాడిని!'

ఆ నాల్గు రోజులూ ఆ మాట చాలాసార్లు అన్నది తులసి.

"మర్చిపో తులసీ, ఏదో వాగాడు. పోనీయ్," అని సమాధానపరచబోయానే కానీ సలహా ఇచ్చినంత తేలిక కాదు అనుభవించటం.

## 4

అన్నంతపనీ చేశాడు దామోదరం. ఏం చేశాడో, ఎవరిచేత చెప్పించాడో తెలియదు కానీ తులసి పనిచేస్తూన్న ఇంటి యజమానురాలికి తులసిపై అయిష్టం, అనుమానం ఏర్పడిపోయాయి. ఫలితంగా తులసి ఉద్యోగం ఊడి పోయింది.

ఎటు పోయిందో యేమో! తులసి మా యింటికి రాలేదు, ఎక్కడా కన్పించనూ లేదు.

కొన్నాళ్ళు అనునిత్యం జ్ఞప్తికి వచ్చేది. క్రమ క్రమాన అపుడపుడూ ఎప్పుడైనా జ్ఞాపకం వచ్చేది.

ఆనాడు దీపావళి. తులసి ఎంతైనా జ్ఞాపకం వచ్చింది. దీపావళికీ హోలీకీ ఆమె పిల్లలందరికీ ఏవేవో బహుమానా లిచ్చేది పాపం, పిల్లలు లేక ప్రేమకొద్దినో మరెందుకో!

రాత్రి బాణా సంచాల హడావుడి అయినాక 'ఉళ్ళో

ఎవరెవరినుండి ఆహ్వానాలు వచ్చాయా? అని ఓ సారి ఆహ్వాన పత్రాలన్నీ తీసి చూశాం.

లక్ష్మీపూజకు ఆహ్వానం అనేకమందినుండి. మార్వాడీలు ఈ రోజు పూజ చేసి ఖాతాలవీ అన్నీ కొత్తగా మొదలు పెడతారు. ఆనంద్‌లాల్ బసంత్‌లాల్ అనే అతని నుండి ప్రత్యేకమైన ఆహ్వానం. ఆ రాత్రి పన్నెండుగంటలకు పార్టీ, కాబరేడాన్సులతో ప్రారంభోత్సవం చేస్తున్నాడు కొత్త హోటల్‌కి.

'ఎవరబ్బా ఈ ఆనంద్‌లాల్? బొత్తిగా ముక్కూ మొహమూ తెలియదే? ఇంత పనిమాలా ఆహ్వానించాడు? కాస్సేపు ఆలోచించాం.'

"ఎవరైతేనేంలే. కొత్తగా పోష్ హోటల్ ప్రారంభించుతున్నట్టున్నాడు. పద, పూజలు ఎప్పుడూ వుండేవే. కాబరే చూద్దాం" అన్నాడు.

"అయ్యో, కాదుమరీ! వెళ్ళండి, వెళ్ళండి" అన్నాను చిరుకోపంతో.

"ఏం. నీతో గుళ్ళూ గోపురాలకు నేను రావటం లేదూ? రావాల్సిందే నువ్వుకూడా త్వరగాతయారుకా."

ఆహూతులలో మాకు పరిచయమున్నవారూ, తెలిసినవారూ చాలామంది ఉన్నారు. సవితాబెనర్జీ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ అందరితో పూసుకు పూసుకు తిరుగుతూ మాట్లాడుతోంది ఏమిటేమిటో. కూతుర్ని పరిచయం చేస్తోంది.

"ఈవిడ కూతుర్నికూడా వెంటేసుకుని వచ్చిందేం

దుకో. పెళ్ళికాని దాన్ని!" మరో సీతాకోకచిలుక చాటుగా విమర్శిస్తోంది.

అంతటి సందట్లోనూ తులసిని జ్ఞాపకం తెచ్చే వ్యక్తులు వచ్చారు. వాళ్లు - ఇటు దామోదరం - ప్రమీలా, అటు ఆమె కొన్నాళ్లు ఆయాగా పనిచేసిన ఇంటి దంపతులూ.

హోటల్ యజమానిని ఊరిలోని పెద్దతలకాయ ఒకతడు చాలా ఘనంగా పరిచయంచేశాడు. కేవలం ప్రజా సేవకే ఆ హోటల్ ప్రారంభించాడట. చాలా బాగున్నదన్పించింది. ఆ వాక్చాతుర్యం.

డ్రింక్స్ సరఫరా ఔతున్నాయి.

తర్వాత హోటల్ యజమాని క్లుప్తంగా అందరి సహకారాన్ని, గుర్తింపునూ కోరుతూ ఎల్లప్పుడూ తన హోటల్‌కు వచ్చే కస్టమర్స్‌కు చక్కటి సేవచేస్తానని వాగ్దానంచేస్తూ, అతిథుల గౌరవార్థం ఆనాడు సిటీకే క్రొత్తదైన గొప్ప కేబరే డాన్సర్‌ను తెచ్చానని సగర్వంగా చెప్పుకున్నాడు.

వెంటనే లైట్లారిపోయి ఎఱ్ఱలైట్లు ఫోకస్‌ఔతూండగా నెమలిలాగా అడుగులు వేస్తూ ప్రవేశించింది నెమలిఫించం వగైరా ధరించి వున్న ఆ నాట్యగత్తె. మెరిసే చెమ్కీ-దుస్తులు......

అందరూ ఆత్రంగా చూస్తూండగా వాద్యాలుమ్రోగ సాగాయి. ఆమె డ్యాన్సు ప్రారంభించింది.

చూచినకొలదీ ఆ ముఖం ఎంతో పరిచయంగా కన్పట్ట సాగిందినాకు. కాని కనురెప్పలదగ్గర్నించీ విపరీతాలంకరణలో

నున్న ఆ వేషంలో గుర్తించడం కష్టంకదా!

పాట చాలా భావయుక్తంగా వుంది. మంద్రంగా ప్రారంభమై తారస్థాయిని అందుకున్నది.

"బోలో! మైకౌన్‌హుఁ బోలో...

ముఝే పహచాన్‌లియా క్యా ?

(నేనెవర్ని చెప్పుకో. నన్ను గుర్తుపట్టావా ?)

"క్యా... నహీ పహచానా?" అంటూ దామోదరం కనులలో కనులుపెట్టి అడుగుతూ అతడి చెంపమీద ఒక్కటి కొట్టింది సుతారంగా.

లైటు రంగు మారింది.

ఒక వలువ తొలగింది.

కొత్త చరణం మొదలుపెట్టింది.

. . ఆ చరణం భావం— 'నేనొకప్పుడు ఒకనికే దేవతను. ఇప్పుడు మీ అందరికీ దేవిని. ఒకనాడు నన్ను మీరంతా వద్దుపొమ్మన్నారు. ఇప్పుడు నా చుట్టూనే మీ రంతా తిరుగుతారు.'

చరణం ముగించుతూ మరలా "క్యా, కోయి నహీ పహచానా? అప్ భీ నహీ పహచానా?" అని దీర్ఘంతీస్తూ మా ఎదుటి టేబుల్‌పైకి వచ్చి కూర్చుంది, వాయిద్యాల కనుగుణంగా శరీరం తమాషాగా త్రిప్పుతూ.

ఉలికిపడ్డాను నేను. 'ఆమె తులసి!' ఖంగారుగా ఆయన వైపు తిరిగాను.

పకపకా నవ్వింది. 'అచ్ఛా, పహచాన్‌లియానా?'

అంటూ వెళ్ళిపోతు ండగా మరో వస్త్రం అదృశ్యమైంది.

"ఆమె! ఆమె తులసికదూ?" మెల్లగా అన్నాను తన్మయమై చూస్తున్న తనతో.

"ఎక్కడా ?" చుట్టూ వున్న అందరివైపు చూడసాగారు.

"ప్రేక్షకులలో కాదు, ఆ డాన్సర్," అన్నాను మరలా.

"చాల్లే." చాలా విసుగ్గా వుంది ఆయన ధోరణి. "ఇక్కడ కూడా నీ బుర్రలో ఆవిడే తిరుగుతూన్నట్లుంది. తులసీ అంటావ్, మరో కాస్సేపటికి మన పనిమనిషి చంపాభాయీ అంటావు. అతగాడు చెప్పలేదూ సిటీకే క్రొత్త డాన్సర్ అనీ?"

నాకు నోరుమూసుకోక తప్పిందికాదు.

కానీ నాఅనుమానం అలాగే వుండిపోయింది. ఇంతగా ఆమె పోలికలున్న ఈమె ఎవరబ్బా?

మరో చరణం పూర్తిచేసి మరలా అలాగే కొందరి వద్దకు వెళ్ళి అడుగుతోంది. నన్ను గుర్తుపట్టారా? అని. ఆఖరున వెర్రిగా ఊపింది శరీరాన్ని. ఆరుగురు మగడాన్సర్స్ తమ చేతులతో ఆమెను పైకెత్తి పట్టుకున్నారు. చప్పట్లు మిన్నంటాయి. నాట్యం ముగిసింది.

చిన్న చిన్న రెండు పేలికలు మాత్రం మిగిలాయి నాట్యగత్తె శరీరంపై. లైట్లు వెలిగాయి.

"ఇంతవరకూ మిమ్ములను ఆనందసాగరంలో ముంచెత్తిన నాట్యశిరోమణి "శ్రీమతి తులసి!" అంటూ ప్రకటిం

చాడు హోటల్ యజమాని.

ఆమె నవ్వుతూ అందరికీ నమస్కారాలు చేసి చేసి నిష్క్రమించింది లోపలికి.

"ఇదేమిటి? ఇదేమిటి?" అందరి కనులలో ముఖాలలో ఒకే ప్రశ్న తాండవిస్తోంది.

"తులసా? చంపాబాయా?" అంటూ విసుక్కున్న ఘనులు కిమ్మనలేదు.

ఒక్కసారి పరిచితులందరి కనులూ దామోదరంవైపు తిరిగాయి. అతడూ ప్రమీలా వడివడిగా పారిపోతున్నట్టే పోతున్నారు. వెనుక ఏదో తరుముకొస్తున్నట్టు.

"ఆఁ, ఇలాటి లొసుగేదో లేనిదే ఆ మొగుడెందుకు వదిలేస్తాడూ?"

"నేనప్పుడే అనుకున్నాను. ఎవడో బాగా డబ్బున్న వాడిని పడుతుందిసుమా అనీ."

సవితా, ఆమె బృందం సభ్యులూ ఒక్కొక్కరే తమ తమ తమ అమూల్య అభిప్రాయాలను వెలిబుచ్చసాగారు.

తల మునకలయ్యే ఆశ్చర్యంలో వెలుపలికి వస్తూం డగా, ఒక బేరర్ పరుగున వచ్చి ఒక ఉత్తరం నాచేత వుంచి వెళ్ళిపోయాడు. "తులసీజీ" అనిమాత్రం చెప్పి.

"ఇంటికివెళ్ళి చదవండి" అని వున్నది కవరుపైన.

నా ఆత్రం వర్ణనాతీతం.

ఇల్లు జేరగానే ఇంకేపనీ చూడకుండా ఆత్రతతో కవరు విప్పాను. తానూ కుతూహలంగా వచ్చి ప్రక్కనే నుంచుని చదవసాగారు.

"దీదీ !

నమస్తే, నన్ను గుర్తుపట్టేసా 'ఇదెలా సంభవం?' అను కుంటారు మీారు. నేను తులసినే! ఇక్కడికి ఈఅవతారంలో ఎలా వచ్చానూ అన్నది వివరంగా చెప్పితే చాలాపౌతుంది. క్లుప్తంగాచెప్తాను. 'మనస్సాక్షిగా చెప్తున్నాను నేనుఎంతో పవిత్రంగా బుద్ధిగాబ్రతుకుదామనే అనుకున్నాను. ఈవిశాల ప్రపంచంలోనికి ఒంటిగా నెట్టివేయ బడినపుడు. చాలా రోజులు అందుకే పోరాడి అలసిపోయాను. ఎన్నో నౌకరీలు మారాను కొలదినెలలలోనే... నేను ఆయాగా పనిచేసిన ఇంటికి కూడా ఓ నమస్కారం కొట్టిపోదును — ఆ నాడు పార్కులో దామోదరం అతడి కొత్తభార్యా నన్నలా బెది రించి వుండకపోతే.

"నేను సర్వనాశనమే కావచ్చు. కాని కక్ష తీర్చుకో వాలనే ప్రతిజ్ఞపట్టాను. అందుకే త్రాగుబోతూ, నీతి నియ మాలూ లేనివాడూ అయిన ఆ యింటి యజమాని నుండి నన్ను నేను రక్షించుకోవాలనే ప్రయత్నమే చేయ లేదు. సవితాబెనర్జీ ద్వారా దామోదరం యింటి యజ మానురాలి మనసులో విషం కురిపించాడు. పలితంగా ఆమె నాకు ఉద్వాసన చెప్పింది. కానీ యజమానిమాత్రం రహస్యంగా నన్ను వేరేయింట వుంచాడు. కొన్ని రోజులకు అతడే నన్నీ హోటల్ యజమానికి ఒప్పగించాడు. ఇప్పుడు నా ఆరాధకు లెందరో!

"పరువుగా బ్రతకాలంటే కష్టం కానీ ఇలాంటి జీవి తానికి ఎంత సుఖమో! తర్వాత ఏ నరకానికైనా

పోనీండి, ఫర్వాలేదు. దామోదరంపై కక్ష తీర్చుకున్నాను చూశారా? నేనే మీ కందరికీ ఆహ్వానాలు పంపింది. నా అదృష్టంకొలదీ అందరూ వచ్చారు. ముఖ్యంగా దామోదరం కొత్తభార్యతో వచ్చాడు. 'మహా ప్రొఫెసర్ని కనుక ఎవరో ఇంత ప్రత్యేకంగా ఆహ్వానించారనీ విర్రవీగుతూ వచ్చినట్లున్నాడు పాపం. నన్ను గుర్తుపట్టాడు - ఎలాగ? మీ అందరి సమక్షంలోనూ. అదే నాకు కావాలి. ఇప్పుడేమైందీ అతడి పరువు? నన్నీ ఊళ్లో వుండనీయనన్నాడు కదూ? ఇప్పుడు తనెలా వుంటాడిక్కడ? నా చుట్టూ ఎంత బలగం ఇప్పుడు? నన్నతడేమీ చేయలేడు. 'ఇది దామోదరం పెళ్ళాంరా' అంటాడు చూసిన ప్రతివాడూ! నన్నతడనుభవింపజేసిన నరకయాతనకు ప్రతిఫలం ఈ చిత్రహింస. పాప పుణ్యాల సంగతి నే నాలోచించనుఇక. ఈ అవమానం వాడొక్కడికే కాదు; ఆ కొత్తభార్యకూ, తల్లితండ్రులకూ, తోబుట్టువులకూ, ఇంటి మొత్తానికే అవమానం. నిష్కారణంగా అన్యాయానికి గురైన నా వంటి అభాగినులంతా ఇలాగే తమ తమ జీవితాలను బలిదానం కావించుకొంటేనే కానీ ఈ అభినవ నరకాసురుల పీడ తగ్గదు; శూర్పణఖల పొగరు అణగదు.

"మీరు నన్ను క్షమించినా క్షమించకపోయినా అర్థం చేసుకో గలరు నా ఎదలోని దావానలాన్ని. అందుకే యింత వివరంగా నా స్థితిని విశదపరచు కున్నాను. నా బ్రతుకు హీనమై పోయిందని నాకు తెలుసు. నాకు కుక్కచావే ప్రాప్తింపవచ్చు. కానీ ఆఖరు క్షణాన మాత్రం

మిమ్మల్నే - నా దీనదశలో ఆదుకున్న మిమ్మల్నే తలచుకుంటాను. అక్కయ్యగారూ ప్రస్తుతం నేను కొత్తతులసిని. మరణించిన పాత తులసికొరకై సానుభూతితో నిండు మనస్సుతో ఓ కన్నీటి చుక్క రాల్చగలరు కదూ ?

“ఈ విధంగా బ్రతుకుతూన్న నేను ఇక మీ యింట అడుగుపెట్టే అర్హత కోల్పోయానని తెల్సు. అందుకే ఈ లేఖ. ఇంకెప్పుడూ యిలా విసిగించను. సెలవు.

జియాజీకి నమస్కారాలు. చిరంజీవులకు నా ముద్దులు.

—తులసి”

కథా నిలయం
924
శ్రీకాకుళం
3-6B